# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 13-12-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పెట్టుబడుదారులకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానంగా మారిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.
- రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో ముస్తాబు కార్యక్రమాన్ని అమలు చేయనున్నామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వెల్లడించారు.
- విశాఖపట్నాన్ని ఐటీ–ఇండస్ట్రియల్ హబ్‌గా అభివృద్ధి చేయాలన్న దృఢ సంకల్పంతో పనిచేస్తున్నామని మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు.
- కేంద్ర ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయితీలకు జమ చేస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.
- దేవాదాయ శాఖకు సంబంధించిన ఎన్నికల హామీలను 95శాతం అమలు చేశామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలియజేశారు.

====================

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పెట్టుబడుదారులకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానంగా మారిందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయవాడలో ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహిస్తున్న బిజినెస్ ఎక్స్‌పో-2025లో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలనే ఆలోచన వచ్చిన క్షణం నుంచి ప్రభుత్వం అన్ని అనుమతులు, అవసరమైన సహకారం వెనువెంటనే అందిస్తోందని పేర్కొన్నారు. యువత తమ ఆలోచనలను ఆచరణలో పెట్టాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించే దిశగా అడుగులు వేసున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలియజేశారు.

====================

రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో ముస్తాబు కార్యక్రమాన్ని అమలు చేయనున్నామని మహిళా శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఈరోజు పార్వతీపురం మన్యం జిల్లా వన్ స్టాప్ కేంద్రం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమమంలో పాల్గొన్న మంత్రి, జిల్లాలోని 2,075 అంగన్వాడీ కేంద్రాలకు మొబైల్ ఫోన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్మార్ట్ ఫోన్ల పంపిణీ అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో డిజిటలైజేషన్ ను ప్రోత్సహించడానికి దోహదపడుతుందన్నారు. ఈ మొబైల్ ఫోన్ల ద్వారా అంగన్వాడీ కార్యకర్తలు సంపూర్ణ పోషణ, పిల్లల హాజరు, పోషకాహార పంపిణీ వంటి కీలకమైన దైనందిన సమాచారాన్ని ఆన్‌లైన్ యాప్స్ లో తక్షణమే నమోదు చేయగలుగుతారని చెప్పారు. దీని వల్ల ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత పెరిగి, సేవలు మరింత వేగంగా ప్రజలకు చేరువవుతాయన్నారు.

====================

విశాఖపట్నం కేంద్రంగా రాష్ట్రాన్ని నాలెడ్జ్ ఎకానమీగా, ఐటీ–ఇండస్ట్రియల్ హబ్‌గా అభివృద్ధి చేయాలన్న దృఢ సంకల్పంతో రాష్ట్రప్రభుత్వం పనిచేస్తోందని కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర అభివృద్ధి ఏ విధంగా సాగుతుందో ఇటీవలి కాలంలో జరుగుతున్న పెట్టుబడి సమీకరణలు స్పష్టంగా నిరూపిస్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖలో ప్రారంభించిన 'కాగ్నిజెంట్' ద్వారా వేలాది ఉద్యోగాలు కల్పిస్తామని ఆ సంస్థ సిఈఓ ప్రకటించడం రాష్ట్రంలో పారిశ్రామిక వాతావరణానికి నిదర్శనమని మంత్రి వ్యాఖ్యానిస్తూ...

(వాయిస్...28 సెకన్లు)

====================

అభివృద్ధి, సంక్షేమం, పారిశ్రామికం, ఆధ్యాత్మికం అన్నింటిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా ఉంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. కర్నూలు నగరంలో 4 కోట్ల 25 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన దేవాదాయ శాఖ కర్నూలు జోన్ పరిపాలనా కార్యాలయ భవన సముదాయాన్ని మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దేవాదాయ శాఖలో 95శాతం అమలు చేశామని చెప్పారు. వైదిక, ఆగమ శాస్త్రం ద్వారా ఉత్సవాలు, పూజా కార్యక్రమాలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇచ్చిందని తెలిపారు. పురాతన ఆలయాలకు పునర్నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామని.. 595 కోట్ల రూపాయలతో 490 ఆలయాలను పునర్నిర్మాణం చేయనున్నామని వెల్లడించారు. 888 జీవో అమలుపై నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.

====================

విరామం

====================

స్థానిక సంస్థలను బలోపేతం చేసేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయితీలకు జమ చేస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుమదం, వడ్లవానిపాలెం గ్రామాల్లో మంత్రి పలు అభివృద్ధి పనులకు ఈరోజు శంకుస్థాపనలు చేసారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పల్లెపండుగ కార్యక్రమం ద్వారా పంచాయితీల్లో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. గ్రామీణ రహదారుల అభివృద్ధికి 2వేల కోట్ల రూపాయలు కేటాయించామని, జల జీవన మిషన్ పథకం ద్వారా 2వేల 250 కోట్ల రూపాయలతో స్వచ్ఛమైన త్రాగునీరు అందిస్తున్నామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్...20 సెకన్లు)

====================

సాస్కి పథకం కింద రాష్ట్రంలో సుమారు 2వేల 500 కోట్ల రూపాయలతో రహదారులను అభివృద్ధి చేస్తున్నామని రోడ్డు రవాణా, రహదారులు మరియు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు తెలిపారు. విజయనగరం జిల్లాలో ఈరోజు విస్తృతంగా పర్యటించిన ఆయన పలు రహదారులను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డితో కలిసి జిల్లాలోని రహదారుల పరిస్థితిపై కలెక్టరేట్లో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ.. సాస్కి పథకం కింద రాష్ట్రంలో ఈ ఏడాది సుమారు 500 కోట్ల రూపాయలతో రహదారుల నిర్మాణాన్ని చేపట్టామని చెప్పారు. వచ్చే ఏడాదినుంచి 2వేల కోట్ల రూపాయలతో రహదారుల నిర్మాణం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని రోడ్లను గుంతలు లేని రహదారులుగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు.

====================

చేనేత, హస్తకళాకారుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని రాష్ట్ర చేనేత, జౌళిశాఖా మంత్రి ఎస్. సవిత అన్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో జాతీయ హస్తకళాకారుల వారోత్సవాల కార్యక్రమంలో మంత్రి ఈరోజు పాల్గొని, కళాకారులు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించారు. అనంతరం విశేష ప్రతిభ కనబరిచిన చేనేత, హస్తకళాకారులను మంత్రి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రుణాలతో చేనేత, హస్తకళాకారులు ఆర్థిక పరిపుష్టి సాధిస్తున్నారని చెప్పారు. ఢిల్లీలో భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ 2023, 2024 సంవత్సరాలకు ప్రకటించిన అవార్డుల్లో రాష్ట్రానికి చెందిన హస్త కళాకారులు అవార్డులు అందుకోవడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తంచేస్తూ...

(వాయిస్...27 సెకన్లు)

=====================

ఉత్తరాంధ్రను ఏఐ, డేటా హబ్ గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు హర్షణీయమని విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. విజయనగరంలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. పొందూరు ఖాదీకి ప్రతిష్టాత్మకమైన జిఐ ట్యాగ్ లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇది కేవలం ఒక వస్త్రానికి వచ్చిన గుర్తింపు మాత్రమే కాదని, శ్రీకాకుళం నేత కార్మికుల వారసత్వానికి లభించిన గౌరవం అని తెలిపారు.

=====================

సత్వర న్యాయం లోక్ అదాలత్ తో సాధ్యమని శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. శ్రీకాకుళం జిల్లా న్యాయస్థానంలో ఈరోజు ఏర్పాటు చేసిన నాల్గవ జాతీయ లోక్ అదాలత్ లో ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న సివిల్, క్రిమినల్ కేసుల పరిష్కారానికి సరైన వేదిక లోక్ అదాలత్ మాత్రమేనని పేర్కొన్నారు.

=====================
=====================